కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలం దేవంపల్లిలో ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణను నిలదీస్తున్న రైతులు

రుణమాఫీ మాకెందుకు కాలే?

- మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణను నిలదీసిన దేవంపల్లి రైతులు
- లక్ష్మీపూర్‌లో రైతుభరోసాపై ప్రశ్నల వర్షం

మానకొండూర్ రూరల్/బెజ్జంకి, జనవరి 21 : రుణమాఫీపై కరీంనగర్ జిల్లా మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణను రైతులు నిలదీశారు. మంగళవారం దేవంపల్లిలో గోదాం ప్రారంభోత్సవంలో మాట్లాడుతుండగా.. తమకు రూ.2 లక్షల రుణమాఫీ కాలేదని రైతులు కలవేని బక్కయ్య, దాడి కొమురయ్య నిలదీశారు. దీనిపై ఎమ్మెల్యే వివరణ ఇచ్చే ప్రయత్నం చేశారు. కొన్ని బ్యాంకులు అప్‌డేట్ కాలేదని, వాటి నుంచి రైతుల వివరాలను ప్రభుత్వానికి పంపించ లేదని, అందుకే అక్కడక్కడా కొందరు రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ కాలేదని చెప్పారు. అప్పుల భారం పెరిగినందున కొన్ని పథకాలకు కోతలు పెడుతున్నామని అన్నారు. దాడి కొంరమ్మ అనే మహిళ ఎమ్మెల్యే వద్దకు వెళ్లి పింఛన్ రూ. 4 వేలు ఇస్తామని చెప్పింద్రు ఇంకెప్పుడు ఇస్తారని ప్రశ్నించింది. ఆమెకూ ఎమ్మెల్యే రాష్ట్రం అప్పుల కుప్పగా మారిందనే చెప్పాడు.

రైతుభరోసాపై మాటతప్పిండ్రు..

రైతు భరోసా కింద రూ.12 వేలు ప్రకటించడంపై సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలం లక్ష్మీపూర్‌లో జరిగిన గ్రామసభలో రైతు చిలువేరు బుచ్చిరెడ్డి మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణను నిలదీశాడు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రైతు భరోసా కింద ఎకరాలకు రూ.15 వేలు ఇస్తామని చెప్పి మాట తప్పడం సరికాదని నిరసన తెలిపాడు. 420 మందిలో 130 మందికే రుణమాఫీ జరిగిందని తెలిపారు.

మహబూబాబాద్ మండలం సోమలతండా గ్రామసభలో ఎమ్మెల్యే మురళీనాయక్‌ను నిలదీస్తున్న స్థానికుడు

సొంతూర్లో ఎమ్మెల్యే మురళీనాయక్‌పై ఫైర్

- లబ్ధిదారుల జాబితాలో తమ పేర్లు లేవంటూ ఆగ్రహం
- సోమలతండా గ్రామసభలో ఎమ్మెల్యేతో వాగ్వాదం

మహబూబాబాద్, జనవరి 21 (నమస్తే తెలంగాణ) : సంక్షేమ పథకాల మంజూరు జాబితాలో తమ పేర్లు లేవంటూ మహబూబాబాద్ ఎమ్మెల్యే మురళీనాయక్‌ను ఆయన సొంతూరులోనే ప్రజలు నిలదీశారు. మంగళవారం మహబూబాబాద్ మండలం పర్వతగిరి గ్రామ పరిధిలోని సోమలతండాలో అధికారులు నిర్వహించిన గ్రామసభలో ఎమ్మెల్యే మురళీనాయక్ పాల్గొన్నారు. అధికారులు లబ్ధిదారుల పేర్లను చదివి వినిపించారు. ఈ సందర్భంగా పలువురు తమ పేర్లు లేవంటూ ఎమ్మెల్యేను నిలదీశారు. అనర్హుల పేర్లు జాబితాలో వచ్చాయంటూ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. అధికారులు ప్రజలకు సర్దిచెప్పేందుకు ప్రయత్నించినా గొడవ సద్దుమణగలేదు. గ్రామస్థులు ఎదురుతిరగడంతో చేసేదేమీ లేక ఎమ్మెల్యే మురళీనాయక్ అర్హులు ఎవరు ఉన్నా ఇక్కడే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇప్పటికే ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్నామని ఎన్నిసార్లు దరఖాస్తు చేసుకోవాలని ఎమ్మెల్యేతో వాగ్వాదానికి దిగారు. చివరికి గ్రామసభ ముగించుకొని వెళ్లిపోయారు.

కుద్వాన్‌పూర్‌లో ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డిని నిలదీస్తున్న మహిళలు

ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డికి నిరసన సెగ

- ఇండ్లు కట్టిస్తానన్న హామీపై మహిళల నిలదీత
- మాట్లాడకుండానే వెళ్లిపోయిన ఎమ్మెల్యే

ఆర్మూర్‌టౌన్, జనవరి 21: ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డికి చేదు అనుభవం ఎదురైంది. మంగళవారం నిజామాబాద్ జిల్లా నందిపేట్ మండలం కుద్వాన్‌పూర్ గ్రామసభకు ఆయన హాజరయ్యారు. గ్రామంలో పది ఇండ్లు కట్టిస్తానని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ఏమైందంటూ మహిళలు ప్రశ్నించారు. గెలిచి ఏడాదైనా ఎందుకు పట్టించుకోవడంలేదని నిలదీశారు. ఇలా గ్రామస్థుల నిలదీతతో ఏమి మాట్లాకుండానే ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి గ్రామసభ నుంచి వెళ్లిపోయారు.

కాంగ్రెస్ నాయకులు చెప్పినోళ్లకే పథకాలు

నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డి ప్రసంగం వీడియో వైరల్

నాగర్‌కర్నూల్, జనవరి 21 : కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు చెప్పిన వారికే సంక్షేమ పథకాలు వస్తాయని నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డి వ్యాఖ్యలు వివాదాస్పదంగా మారాయి. తెలకపల్లి మండలంలో సోమవారం నిర్వహించిన కాంగ్రెస్ ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన చేసిన ఈ ప్రసంగం వీడియో సోషల్‌మీడియాలో చక్కర్లు కొడుతున్నది. వీటిని విన్న ప్రజలు ఆశ్చర్యానికి గురవుతున్నారు. ప్రజాపాలన అంటూ అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలకు చెప్పిన వారికే పథకాలు వస్తాయంటూ తాను స్వయంగా టిక్కు కొట్టిన వారికే ఇందిరమ్మ ఇండ్లు, రేషన్‌కార్డులు వస్తాయని చెప్పడం చూస్తే ప్రజాపాలన తీరును ఎమ్మెల్యేనే బట్టబయలు చేసినట్టయింది.

కొందరు కూలీలకే ఆత్మీయ భరోసా

భూమిన్నోళ్లకు రైతుభోరోసా ఇత్తమంటున్నరు.. భూమిలేనోళ్లకు రూ.15వేలు సాయంజేత్తమంటున్నరు.. అయ్యా..సారు.. మాకు భూమిలేకపాయె.. బతుకని నీడలేకపాయె.. అప్పుడప్పుడు ఉపాధిహామీ పనులు జేసుకుంటం.. మా సంగతేందని నిరుపేదలు అడుగుతున్నరు.. సోనియమ్మకు జెప్పినం.. ఆ తల్లీగూడా ఆదుకోవాలని చెప్పింది.. అందుకే ప్రతి ఉపాధిహామీ కూలీకి ఏడాదికి రూ.12వేలు ఇప్పించే బాధ్యత కాంగ్రెస్ తీసుకున్నది.

– అసెంబ్లీ ఎన్నికల సభల్లో సీఎం రేవంత్‌రెడ్డి

రైతుకూలీలకు ఆర్థిక సాయం కోసం రూ.900 కోట్లు కేటాయిస్తున్నం. మొత్తం 15 లక్షల మందికి సాయమందిస్తాం. *– డిసెంబర్ 23న రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి*

భూమిలేని ఉపాధి కూలీలకు ఆర్థిక భరోసానిచ్చే ఉద్దేశంతో ప్రభుత్వం ఇందిరమ్మ ఆత్మీయ భరోసాకు శ్రీకారం చుట్టింది. ఎన్నికల్లో ఇచ్చినమాటకు కట్టుబడి ఈ నిర్ణయం తీసుకున్నం. కుటుంబం యూనిట్‌గా స్కీంను అమలు చేస్తం. రాష్ట్రంలో మొత్తం 48,13,966 మందికి జాబ్‌కార్డులు ఉన్నాయి. ఇందులో 20 రోజులు పనిచేసినవారు 17.26 లక్షల కుటుంబాలు ఉన్నట్టు లెక్కతేలింది. వీరిలో 11 లక్షలకుపైగా కుటుంబాలు రైతుభరోసా లబ్ధిదారులు.. ఇక మిగిలిన ఆరు లక్షల మందికి ఏడాదికి రూ.12వేల చొప్పున ఇస్తం.

– ఈ నెల 19న పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క ప్రకటన

నాడు ప్రతిఒక్క ఉపాధిహామీ కూలీకి ఇస్తామంటూ రేవంత్‌రెడ్డి హామీ

- ఇప్పుడు ఆరు లక్షల మందే అర్హులంటూ మంత్రి సీతక్క ప్రకటన
- సర్కారు వైఖరిపై నిరుపేదల ఆగ్రహం
- తాజాగా గ్రామసభల్లో నిలదీతలు

హైదరాబాద్, జనవరి 21 (నమస్తే తెలంగాణ): ముఖ్యమంత్రి, మంత్రుల ప్రకటనలు చూస్తే, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా అమలుపై సర్కారు చిత్తశుద్ధిమిటో అర్థమవుతున్నది. నిరుపేదల ఓట్లు కొల్లగొట్టి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఇప్పుడు వారికి మెండి'చెయ్యి' చూపుతున్నది. ఎన్నికల ముందు ప్రతి కూలీకి రూ.12 వేలు ఇస్తామని సీఎం రేవంత్‌రెడ్డి, 15 లక్షల మందికి వర్తింపజేస్తామని గత నెల 23న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి చెప్పారు. తీరా ఆరు లక్షల మందికే ఆత్మీయ భరోసా వర్తింపజేయనున్నట్టు తాజాగా గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క ప్రకటించారు. ప్రభుత్వ వైఖరిపై నిరుపేదలు భగ్గుమంటున్నారు.

పథకాల జాబితాలో అర్హుల పేర్లు ఎందుకు లేవంటూ ఖమ్మం జిల్లా ఖమ్మం రూరల్ మండలం మద్దులపల్లిలో అధికారులను నిలదీస్తున్న గ్రామస్తులు

జాబ్‌కార్డులు 53.6 లక్షలు.. ఇచ్చేది ఆరు లక్షల మందికి..

రాష్ట్రవ్యాప్తంగా 53.6 లక్షల కుటుంబాలకు జాబ్‌కార్డులు ఉన్నాయి. వీరిలోకొందరిని వివిధ కారణాలతో తొలగించిన తర్వాత సుమారు 48,13,966 మంది మిగిలారు. ఇందులో 22.64 లక్షల మంది ఒక్కరోజూ కూడా పనిచేయలేదు. మిగిలిన 25.5 లక్షల మందికి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఒక్కో కుటుంబానికి ఏడాదికి రూ.12 వేల చొప్పున సుమారు రూ.3,100 కోట్లు సాయం చేయాల్సి ఉంటుంది. కానీ, సర్కారు లబ్ధిదారుల సంఖ్యను పది శాతానికి తగ్గించింది. దీంతో కంటితుడుపుగా పథకాన్ని అమలుచేయాలని నిర్ణయించినట్టు అర్థమవుతున్నది.

ఎకరంలోపు ఉన్నవారు అనర్హులా?

ఎకరం సాగుభూమి ఉన్నవారికి రైతుభరోసా కింద ఏడాదికి రూ.12వేలు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఉపాధిహామీ కూలీల్లో ఎకరంలోపు ఉన్న సుమారు 10 లక్షల మందికి ఏడాదికి రూ.12వేలలోపే రైతుభరోసా అందనున్నది. అంటే ఉపాధికూలీలకు ఆత్మీయ భరోసా కింద ఇచ్చే నగదుకంటే వీరికి తక్కువగా ఇవ్వనున్నది. కేవలం అర ఎకరం, అంతకులోపున్న వారికి నామమాత్రంగా పెట్టుబడి సాయం అందించడం ఎంతవరకు సమంజసమని నిట్టూరుస్తున్నారు. ఎకరంలోపు ఉన్నవారిని కూడా కూలీల కింద పరిగణించాలని కోరుతున్నారు.

20 దినాలే పరిగణనలోకి ఎందుకు?

2023-24 సంవత్సరంలో 20 రోజులు పనికి వెళ్లినవారికే ఆత్మీయ భరోసా ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఎన్నో ఏండ్ల నుంచి జాబ్‌కార్డు ఉండి, 2023-24 సంవత్సరం వరకు పనిచేసిన కూలీలను విస్మరించడంపై ఆయావర్గాల నుంచి అభ్యంతరం వ్యక్తమవుతున్నది. ఇన్నేళ్లు పనిచేసి ఈ ఒక్క సంవత్సరం వెళ్లకుంటే అనర్హులని చెప్పడం ఎంతవరకు కరెక్ట్ అని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. తమను సైతం లబ్ధిదారులుగా గుర్తించాలని కోరుతున్నారు.

వలసెళ్లినవారి పరిస్థితేమిటి?

జాబ్‌కార్డులు కలిగిన లక్షలాది ఉపాధిహామీ కూలీలు బతుకుదెరువు వెదుక్కుంటూ దుబాయ్, సౌదీ, ఇరాన్, ఖతార్ లాంటి దేశాలతోపాటు ముంబై, సూరత్, షోలాపూర్ లాంటి ప్రాంతాలకు వెళ్లారు. వీరు సొంతూర్లలో ఉన్నప్పుడు పనికి వెళ్లినవారే. ఇప్పుడు ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లినందున ఆత్మీయ భరోసా కింద సాయం చేయకపోవడంతో వీరంతా నష్టపోనున్నారు. ఈ విషయంపై ప్రభుత్వం పునరాలోచించాలని కోరుతున్నారు.

విలీనమైన పల్లెలోని కూలీలకు నిరాశే

ప్రభుత్వం ఇటీవల రాష్ట్రంలోని వందలాది పంచాయతీలను సమీపంలోని పట్టణాలు, నగరాల్లో విలీనం చేసింది. ఆయా గ్రామాల్లోని నిరుపేదలు ఇంతకాలం ఉపాధిహామీ కూలీకి వెళ్లి పొట్టపోసుకున్నారు. అయితే, ఆ గ్రామాలు మున్సిపాలిటీల్లో విలీనం కావడంతో వారందరూ జాబ్‌కార్డులను కోల్పోనున్నారు. వీరిలో భూమిలేని అనేకమందికి కూడా రూ.12 వేలు సాయం అందదు. ప్రభుత్వం గత ఏడాదిలోని పనిదినాలను పరిగణనలోకి తీసుకోకుండా అంతకుముందు పనిచేసిన తమకు సాయం చేయాలని విజ్ఞప్తిచేస్తున్నారు.

గ్రామసభల్లో నిలదీతలు..

ఎకరానికిపైగా భూమి ఉన్న అనేకమంది పేర్లను ఆత్మీయ భరోసా లబ్ధిదారుల జాబితాలో చేర్చారని తాజాగా నిర్వహించిన గ్రామసభల్లో అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. చాలాచోట్ల నిరుపేద కూలీలు అధికారులను నిలదీశారు. భూమిలేని తమకు అన్యాయం చేస్తూ, భూమి ఉన్నవారికి సాయం చేయడమేమిటని ప్రశ్నించారు. పేదల ముసుగులో కాంగ్రెస్ కార్యకర్తలను లబ్ధిదారులుగా చేర్చారని ఆరోపించారు. ప్రభుత్వం ఇప్పటికైనా అర్హులను గుర్తించి సాయం చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

రాష్ట్రంలో జాబ్‌కార్డులు	53.6 లక్షలు
తొలగించిన తర్వాత మిగిలినవి	48.14 లక్షలు
ఒక్కరోజూ పనిచేయని వారు	22.64 లక్షలు
మిగిలిన నిరుపేద కూలీలు	25.5 లక్షలు
ప్రభుత్వం సాయం చేయాలని నిర్ణయించింది	6 లక్షలు

ఆక్రమణదారులపై చేయిచేసుకుంటున్న ఎంపీ ఈటల

ఆక్రమణదారులపై చేయిచేసుకున్న ఈటల

పోచారం,జనవరి21: పేదల స్థలాలను పరిశీలించడానికి వెళ్లిన మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అక్కడే ఉన్న ఆక్రమణదారులపై చేయిచేసుకున్నారు. పోచారం మున్సిపాలిటీ పరిధిలోని కొర్రెముల రెవెన్యూ పరిధిలోని ఏకశిలానగర్ ప్లాట్లను కొంతమంది ఆక్రమించడానికి ప్రయత్నిస్తూ, భయభ్రాంతులకు గురిచేస్తున్నారని, తమకు న్యాయంచేయాలని బాధితులు సోమవారం ఎంపీ ఈటల రాజేందర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. దీంతో ఈటల రాజేందర్ బీజేపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి మంగళవారం అక్కడకు చేరుకొని స్థలాలను పరిశీలించారు. అదే సమయంలో ఆక్రమణదారునికి సంబంధించిన ఆరుగురు వ్యక్తులు మద్యం సేవిస్తూ అక్కడ కనిపించారు. వారిలో ఒకరిపై ఎంపీ ఈటల రాజేందర్ స్వయంగా చేయిచేసుకున్నారు. దీంతో మిగతావారిని పట్టుకొని కార్యకర్తలు చితకబాదారు. వీరిలో నలుగురు అక్కడినుంచి పారిపోగా, మరో ఇద్దరు ఉపేందర్, రఫీక్ కార్యకర్తలకు చిక్కడంతో చితకబాదారు. దీంతో పోచారం పోలీసులు అక్కడకు చేరుకొని పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. అనంతరం మ ల్కాజిగిరి ఏసీపీ చక్రపాణి సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. తమపై ఎంపీ ఈటల, ఆయన అనుచరులు దాడి చేశారని ఉపేందర్ ఫిర్యాదుచేయడంతో పోలీసులు కేసు నమోదుచేశారు.

93 మందికి నాయబ్ తహసీల్దార్లుగా పదోన్నతి

హైదరాబాద్, జనవరి 21 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర రెవెన్యూ శాఖలో 93 మందికి నాయబ్ తహసీల్దార్లుగా పదోన్నతి కల్పించారు. ఈ మేరకు ఆ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్ తాజాగా ఉత్తర్వులు జారీ చేశారు. డీపీసీ సూచనల మేరకు 6 జోన్లలోని సీనియర్ అసిస్టెంట్లు, అడ్‌హక్ నాయబ్ తహసీల్దార్లకు పదోన్నతులు కల్పించినట్టు వెల్లడించారు.

కొత్త రేషన్‌కార్డులు 6.6 లక్షలే!

- కులగణన ఆధారంగానే జారీ
- గ్రామసభల్లో ఇచ్చే దరఖాస్తులకు ఇప్పుడు మోక్షం లేనట్టే
- 10 లక్షల కొత్తకార్డులు ఇస్తామన్న మంత్రి ఉత్తమ్
- స్మార్ట్ కార్డుల జారీపై వెనక్కితగ్గిన ప్రభుత్వం

మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట గ్రామసభలో అధికారులను నిలదీస్తున్న ప్రజలు

హైదరాబాద్, జనవరి 21(నమస్తే తెలంగాణ): కొత్త రేషన్‌కార్డుల్లో కోత ఖాయమైంది. పది లక్షల కొత్త కార్డులు ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ సర్కారు ఇప్పుడు సగం కోత పెట్టింది. రాష్ట్రవ్యాప్తంగా 6.68 లక్షల రేషన్‌కార్డులు మాత్రమే ఇవ్వబోతున్నట్టు తెలిసింది. ఈ నెల 18న జిల్లాలవారీగా అర్హుల జాబితాను సిద్ధంచేసిన ప్రభుత్వం ఇదే జాబితాను జిల్లాలకు పంపించినట్టు తెలిసింది. ఈ జాబితా ప్రకారమే గ్రామసభల్లో చర్చించి కొత్త కార్డులు జారీ చేయనున్నది.

కులగణననే ప్రామాణికం

కొత్త కార్డుల జారీ కోసం ప్రభుత్వం కులగణన సర్వేను ప్రామాణికంగా తీసుకున్నట్టు తెలిసింది. ఈ సర్వేలో రేషన్‌కార్డు లేదని తెలిపిన వారిని మాత్రమే పరిగణనలోకి తీసుకున్నట్టు తెలిసింది. కులగణన సర్వేలో కొత్త కార్డుల కోసం 12 లక్షల దరఖాస్తులు వచ్చాయని, ఇందులో సుమారు 10 లక్షల వరకు ఇచ్చే అవకాశం ఉన్నదని పలు సందర్భాల్లో మంత్రులు వ్యాఖ్యానించారు. కానీ, ఇప్పుడు వీటిని వివిధ కొర్రీలతో వడపోయగా 6.68 లక్షల మందిని అర్హులుగా తేల్చింది.

గ్రామసభ దరఖాస్తుల సంగతేమిటి?

కొత్త రేషన్‌కార్డుల జారీకి కులగణన సర్వేను లింకు చేయడంపై ప్రజల నుంచి తీవ్ర స్థాయిలో వ్యతిరేకత వ్యక్తమైన నేపథ్యంలో ఇప్పుడు రానివారి నుంచి గ్రామసభల్లోనూ దరఖాస్తులు స్వీకరిస్తామని ప్రభుత్వం తెలిపింది. అయితే, ఇది కేవలం ప్రజలను మభ్యపెట్టేందుకు, కోపాన్ని తగ్గించడానికేనని, గ్రామసభల్లో స్వీకరించనున్న దరఖాస్తులకు ఇప్పట్లో మోక్షం కష్టమేనన్న అభిప్రాయం వ్యక్తమవుతున్నది. ఆరోగ్యశ్రీతో ఇతర పథకాలకు రేషన్‌కార్డు లింకును తొలగిస్తామని పేర్కొన్నది. ఇందులోభాగంగా రేషన్‌కార్డుల స్థానంలో స్మార్ట్‌కార్డులను (ఏటీఎం మాదిరిగా) జారీ చేస్తామని వెల్లడించింది. కానీ, ఇప్పుడు స్మార్ట్‌కార్డులపై ప్రభుత్వం సప్పుడు చేయడం లేదు. పాత పద్ధతిలోనే రేషన్‌కార్డులను జారీచేస్తున్నది.

జిల్లాలవారీగా అర్హుల జాబితా

జిల్లా	అర్హుల జాబితా					
ఆదిలాబాద్	18,741	ఆసిఫాబాద్	14,407	పెద్దపల్లి	15,255
కొత్తగూడెం	29,141	మహబూబాబాద్	17,745	సిరిసిల్ల	9,731
హనుమకొండ	14,431	మహబూబ్‌నగర్	14,965	రంగారెడ్డి	29,405
హైదరాబాద్	83,285	మంచిర్యాల	18,788	సంగారెడ్డి	26,158
జగిత్యాల	19,974	మెదక్	11,515	సిద్దిపేట	18,213
జనగామ	9,997	మేడ్చల్	12,243	సూర్యాపేట	25,376
భూపాలపల్లి	8,191	ములుగు	7,198	వికారాబాద్	23,542
గద్వాల	13,946	నాగర్‌కర్నూల్	16,006	వనపర్తి	6,647
కామారెడ్డి	21,842	నల్లగొండ	27,523	వరంగల్	12,773
కరీంనగర్	18,384	నారాయణపేట	12,639	భువనగిరి	16,474
ఖమ్మం	37,152	నిర్మల్	17,491	మొత్తం	6,68,309
		నిజామాబాద్	39,139		

కాళేశ్వరంతో రాష్ట్రానికి ఆదాయం

సాగు, తాగునీటికి తొలి ప్రాధాన్యం

- వాణిజ్య అవసరాలతోనూ ఇన్‌కం
- ఆర్థికశాఖ స్పెషల్ సీఎస్ రామకృష్ణారావు
- పీసీ ఘోష్ కమిషన్ ఎదుట హాజరు

హైదరాబాద్, జనవరి 21 (నమస్తే తెలంగాణ): 'కాళేశ్వరం ప్రాజెక్టు తొలి ప్రాధాన్యంగా సాగునీటి అవసరాలు తీర్చడం.. ఫలితంగా పంటల దిగుబడులు పెరిగి రైతుల సంపద సృష్టి జరగాలన్నది ప్రధాన ఉద్దేశం. మలి ప్రాధాన్యంగా భూగర్భ జలాలు పెరిగి తాగునీటి అవసరాలు తీరడం. ఆ తర్వాత పరిశ్రమలకు నీటిని అమ్మడం, తాగునీటి సరఫరా ద్వారా వచ్చే సొమ్ముతో రెవెన్యూ పెంచడం మరో ముఖ్య ఉద్దేశం. దాంతోపాటు కాళేశ్వరం ప్రాజెక్టును టూరిస్టు స్పాట్‌గా అభివృద్ధి చేసి మరోరకంగా ఆదాయాన్ని రాబట్టడం' అని జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఎదుట ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు వివరించారు. కాళేశ్వరం ప్రాజెక్టు తెలంగాణ అంతటికీ ఆదాయ వనరుగా మారిందని వివరించారు. ఈ మేరకు ఆయన కాళేశ్వరం కమిషన్‌కు నివేదికను సమర్పించారు. హైదరాబాద్ బీఆర్‌కే భవన్‌లో జస్టిస్ పీసీ ఘోష్ నేతృత్వంలో జరిగిన బహిరంగ విచారణకు రామకృష్ణరావు మంగళవారం హాజరయ్యారు. ఆయన సమర్పించిన అఫిడవిట్, కాగ్ నివేదిక ఆధారంగా కమిషన్ విచారణ కొనసాగింది. కాళేశ్వరం కార్పొరేషన్ రుణాలు, ప్రాజెక్టు డిజైన్లు, బడ్జెట్ కేటాయింపులు తదితర అంశాలపై జస్టిస్ పీసీ ఘోష్ అడిగిన 24 ప్రశ్నలకు రామకృష్ణారావు బదులిచ్చారు. కార్పొరేషన్‌కు ఆదాయం సమకూరేలా ప్రత్యేకమైన రెవెన్యూ వ్యవస్థ ఉండేలా చర్యలు తీసుకోవాలని 2015 అక్టోబర్ 6న జీవో 145ను ప్రభుత్వం జారీ చేసిందని, దాని అర్థం ఏమిటని? అదేవిధంగా కార్పొరేషన్‌కు ఇప్పటివరకు ఆదాయం ఏమైనా వచ్చిందా? అన్న కమిషన్ ప్రశ్నలకు ఆయన సమాధానాలు ఇచ్చారు.

జీవో 145 మేరకే బరాజ్‌ల నిర్మాణం

జీవో 145 మార్గదర్శకాలకు అనుగుణంగానే బరాజ్‌ల నిర్మాణం కొనసాగిందని రామకృష్ణారావు వివరించారు. ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్, క్యాబినెట్ ఆమోదంతోనే ప్రాజెక్టును చేపట్టారని, బ్యారేజీల నిర్మాణం, వాటి పురోగతిపై ఎప్పటికప్పుడు చర్చించేలా కోర్ కమిటీని ఏర్పాటు చేశారని, ఫిస్కల్ పాలసీని అనుసరించి 3 బ్యారేజీలకు సంబంధించి ప్రతి స్టేట్‌మెంట్‌ను ప్రభుత్వం అసెంబ్లీలో పెట్టిందని తెలిపారు. ప్రాజెక్టు కోసం ప్రభుత్వ గ్యారెంటీతోనే రుణాలను తీసుకున్నట్టు వివరించారు. కేఐసీఎల్ ప్రతి ఆర్థిక సంవత్సరానికి బ్యాలెన్స్ షీట్ మెయింటెన్ చేసిందా? అని కమిషన్ ప్రశ్నించగా, కార్పొరేషన్ ఆ డేటాను తయారు చేసిందని సమాధానమిచ్చారు. ప్రభుత్వమే రుణాలకు గ్యారెంటర్‌గా ఉన్నదని, 2024-25 ఆర్థిక సంవత్సరానికి గానూ అసలు రూ.7,382 కోట్లు కాగా, వడ్డీ కింద మరో రూ.6,519 కోట్టను ప్రభుత్వం చెల్లిస్తున్నదని రామకృష్ణారావు తెలిపారు.

పరిశ్రమలకు నీటిని సరఫరా చేయడం ద్వారా కార్పొరేషన్‌కు ఇప్పటివరకు రూ.7 కోట్ల మేర ఆదాయం సమకూరిందని రామకృష్ణారావు వివరించారు. వ్యవసాయానికి సాగునీరు అందించడం ద్వారా పంట దిగుబడులు పెరిగి రైతులకు ఆదాయం వస్తున్నదని చెప్పారు. జీవో 145 ప్రకారం ప్రాజెక్టు నిర్మాణానికి రుణాల ద్వారానే నిధులు సమకూర్చుకునేలా కార్పొరేషన్‌కు అవకాశం కల్పించారని, ప్రాజెక్టు పూర్తయి సొంత ఆదాయం సమకూరే వరకూ కార్పొరేషన్ నిర్వహణకు రూ.100 కోట్ల కార్పస్ ఫండ్‌ను కేటాయించి వినియోగించుకునేలా అవకాశం కల్పించారని తెలిపారు.

కేసు మీద కేసు పెట్టి.. రైతులపై పగబట్టి..!

66 రోజులు జైలులో మగ్గిన లగచర్ల రైతులు • నలుగురు బాధితులకు తాజాగా బెయిల్ మంజూరు

ఈ నెల 8వ తేదీనే బెయిల్ మంజూరు చేసిన హైకోర్టు • విడుదలైన వెంటనే మరో కేసుల్లో అరెస్టు

తిరిగి పన్నెండు రోజుల పాటు జైలులోనే గడిపిన రైతులు • తాజాగా హైకోర్టు బెయిల్ ఇవ్వడంతో నేడు విడుదల

హైదరాబాద్, జనవరి 21 (నమస్తే తెలంగాణ): ఒక సంఘటన.. కానీ రెండు కేసులు.. ఒక కేసులో జైలుకు వెళ్లి హైకోర్టు నుంచి బెయిల్‌పొంది బయటకు రాగానే అదే ఘటనపై నమోదైన మరో కేసులో మళ్లీ అరెస్టు.. తిరిగి అదే జైలు! ఇలా ఒకటీ రెండు కాదు.. ఏకంగా 66 రోజులపాటు జైలు జీవితం! వాళ్లేదో దొంగలు కాదు.. ఉగ్రవాదులు అంతకన్నాకాదు. తమ భూమిని సర్కారు గుంజుకుంటే కడుపుమండి తిరగబడిన రైతులు. వికారాబాద్ జిల్లా సీఎం రేవంత్‌రెడ్డి సొంత నియోజకవర్గం కొడంగల్ పరిధిలోని లగచర్లలో రెండు నెలల క్రితం అధికారులపై జరిగిన దాడిలో పోలీసులు పలువురు గ్రామస్థులపై కేసులు నమోదుచేశారు. ఈ కేసుల్లో రెండోసారి జైలుకు వెళ్లిన నలుగురు రైతులు హైకోర్టు ఆదేశం మేరకు రూ. 25 వేల పూచీకత్తుపై మంగళవారం విడుదలయ్యారు. లగచర్లలో నవంబర్ 11న అధికారులపై జరిగిన దాడికి సంబంధించి బొమ్రాస్‌పేట పోలీసులు 27 మందిని రిమాండ్‌కు పంపారు. వీరిలో కొంతమందికి గతంలోనే హైకోర్టు బెయిల్ మంజూరు చేయడంతో సంగారెడ్డి జైలు నుంచి విడుదలయ్యారు. మిగిలినవారిలో రమేశ్, గోపాల్‌నాయక్, మాదరయ్య, మంగ్యానాయక్ అనే నలుగురు రైతులకు ఈ నెల 8న హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది. దీంతో వీరు సంగారెడ్డి జైలునుంచి విడుదలయ్యారు. కానీ పోలీసులు వీరిపై క్రైం నంబర్లు 154, 155పై కూడా కేసులు ఉన్నాయంటూ వెంటనే అరెస్టు చేశారు. దీంతో రైతులు మళ్లీ సంగారెడ్డి జైలులోనే ఉండాల్సి వచ్చింది.

హైకోర్టులో బెయిల్ మంజూరు

మళ్లీ అరెస్టు అయిన రైతులకు సంబంధించిన బెయిల్ పిటిషన్‌పై జస్టిస్ కే లక్ష్మణ్ మంగళవారం విచారణ చేపట్టారు. పిటిషనర్ల తరపు న్యాయవాది వాదనలు వినిపిస్తూ నిందితులకు హైకోర్టు బెయిల్ మంజూరు చేసినప్పటికీ అదే ఘటనకు చెందిన మరో కేసులో మళ్లీ అరెస్టు చేశారని తెలిపారు. దీనిపై పబ్లిక్ ప్రాసిక్యూటర్ వాదిస్తూ.. లగచర్ల గ్రామస్థులు ఇచ్చిన వాంగ్మూలాల ఆధారంగానే కేసులు నమోదు అయ్యాయని వివరించారు. వాదనలను, రికార్డులను పరిశీలించిన హైకోర్టు.. గ్రామస్థులు ఇచ్చిన వాంగ్మూలాల్లో పిటిషనర్ల పేరు తప్ప మరేమీ ప్రత్యేకంగా కనించడంలేదని తప్పు పట్టింది. నేరాల్లో కూడా వారి పాత్ర గురించి ఏమీ లేదని చెప్పింది. నవంబర్ 16 నుంచి జనవరి 8 వరకు తిరిగి 9 నుంచి జైలులోనే ఉన్నార